"పార్వతీ....నీ కూతురు బంగారపు బొమ్మేనే. దీని పేరేమిటన్నావ్? రజనీప్రియ కదూ? పిల్లకు తగ్గట్లే ఉంది పేరు." తెల్లగా, బొద్దుగా ముద్దుగా ఉన్న మూడేళ్ళ రజనిని ముద్దెట్టుకుంటూ అంది విద్య.

'మీ పెద్ద దాని పేరేమిటి?'

"మాల. దానికి రెండో యేడప్పుడే రజని కడుపులో పడింది. మా యిద్దరి పోలికా రాకుండా నల్లగా వికారంగా పుట్టింది. దానికి తెలివి కూడా శూన్యం. అదుగో. ఆ మహాతల్లే...." అటుగా వచ్చిన మాలతిని చూపింది పార్వతి.

"ఆ....మహా మురిసిపోతున్నాడులే దాని అందం చూసుకుని. అందం ఎల్లకాలం ఉండబోయేదా యేం? మీరనేది అర్థం కాకున్నా అస్తమానం చెల్లిని ముద్దు చేస్తూ ఉత్తి పుణ్యానికే దాన్నలా కసురుకుంటే ముఖం ఎలా చిన్నబోయిందో చూడండి...." నిష్ఠూరంగా అంటూ మాలతిని చంకనెట్టుకుని వెళ్తున్న కాంతమ్మ గారిని చూసి పెద్దగా నవ్వుకున్నారిద్దరూ.

*

"నానమ్మా....రాజుకివాళ యేమయిందే. అరటిపండులు, బిచకెత్తులు తెచ్చాలు?" కాంతమ్మ గారి వళ్ళో కూర్చుని ముద్దుగా అడిగింది మాలతి.

"దానికివాళ పుట్టిన రోజు చేశారమ్మా. బిచకెత్తులు నువ్వు తిన్నావా మరి!" ప్రేమగా అడిగింది.

"ఊహు. తినలే. యిందాక అమ్మనడిగితే 'ఎప్పుడూ తిండి గొడవే మొద్దూ' అని తిట్టింది. రాజుకు అందరూ గౌన్లు, బొమ్మలూ యిచ్చారు కానీ నా కియ్యలేదేం నానమ్మా. నేనూ కొత్త చొక్కా యేచుకున్నాగా...." తన ఫ్రాక్ ని చూపుతూ అంది.

"నీకూ పుట్టినరోజు పండగ చేస్తే నీకూ యిస్తారు. కాని వికారంగా పుట్టిన నిన్ను, తన కూతురని చెప్పుకుందుకే మీ అమ్మకు చిన్నతనం. ఇంక పుట్టిన రోజులు కూడానా?" పసిపిల్లతో అంటున్నాననే ధ్యాస లేకుండా అంటున్న ఆమె మాటలకు బిక్కమొహమేసింది మాలతి. ఏదో పనిమీద వచ్చిన పార్వతి—అత్తగారి మాటలు విని గబగబా వచ్చింది. "ఏంటత్తయ్యా అలా గంటారు? అది అందంగా లేనంత మాత్రాన నా కూతురు కాకుండా పోతుందా? చిన్నపిల్లని అందరూ ముచ్చట పడ్తుండటంతో రజనిని పిక్చర్స్‌కు, పేరంటాలకు తీసుకెళ్ళినంత మాత్రాన మాలతంటే ప్రేమ లేనట్లేనా?" కోపంగా అంది.

"నిజం చెప్పవే పార్వతీ. మాలతీ, రాజుల మీద ఒకేలాటి ప్రేముందా నీకు? రాజు పుట్టిందగ్గర్నించి ఏదో వంకతో పేరంటం చేస్తున్నావు కానీ మాలతి కొక్కనాడైనా చేశావా? రజనికున్న

## విద్యార్థినుల కథా రచనల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ

రంగు రంగుల గౌన్లు మాలతికి రెండైనా ఉన్నాయా? రెండు జతల బూట్లుండగానే దానికీ రోజు మళ్ళీ బూట్లు కొన్నావు. ఎన్నిరోజులు ఏడ్చినా మాలతి విషయం పట్టించుకోవు..." జాలిగా మనవరాలి వీపు నిమురుతూ అంది.

"బాగుందండీ మీరనేది. దానికీ రోజు కొన్న బట్టలు మరు రోజుకు బిగుతయి కూర్చుంటుంటే ఎన్నని కొనగలము? ఎక్కడి చెప్పులు అక్కడ వదిలి వచ్చేదానికి చెప్పులే దండగ. రజని కాన్వెంట్ కెళ్ళే పిల్లని, బూట్లు తీసుకున్నాను. అదీ తప్పేనా?...." కోపంగా అంది.

"పోనీ మాలతిని గూడా ఆ కాన్వెంట్‌లోనే చేర్పొచ్చుగా...."

"యిద్దర్నీ కాన్వెంట్‌లో చేర్చటానికి మనమేమైనా లక్షాధికారులమా! రోజుకో రకంగా అందంగా తయారయే నా ఫ్రెండ్స్ పిల్లలతో దీన్ని కలిపినా వాళ్ళ మధ్య దిష్టి బొమ్మలా ఉంటుందిది. మీకేమర్థమవుతాయవి?" విసురుగా వెళ్తున్న కోడల్ని చూసి నిట్టూర్చింది కాంతమ్మ.

*


'మాలతీ....' వీక్లీ చదువుతున్న మాలతి తలెత్తింది.

'భవానీ....నువ్వా? ఎప్పుడొచ్చావ్....' సంతోషంగా ఎదురెళ్ళింది.

'అమ్మయ్య....నువ్వేకదా, బాగా వళ్ళొచ్చిందేమో, గుర్తుపట్ట లేకపోయాను. వయసునిబట్టి కాక మనుష్యుల్ని బట్టి డ్రెస్ సెలక్ట్ చేసుకోవాలే తల్లీ. నువ్వు లంగాలు మానేసి హాయిగా శారీస్ కట్టటం మొదలెట్టు. కొంచెం స్లిమ్‌గా కన్పిస్తావు. స్ఫోటకం రావటంతో నీ ముఖం నిజంగా చంద్రబింబంలా గుంటే యిప్పుడు." నవ్వుతూ అంటున్న భవాని మాటలకు తల దించుకుంది మాలతి. భవానికి తను చాలా అందగత్తెనని నమ్మకం. ఎదుటి మనిషెంత బాధపడ్తుందో ననే ఆలోచన లేకుండా అనేస్తుంది ఎప్పుడూ.

'అక్కా....అమ్మ పిలుస్తోంది...' నీలం పట్టు లంగా, పైని తెల్లటి వోణీతో పొడవుగా ముందుకు పడ్తున్న రెండు జడలను వెనక్కు తోసుకుంటూ ఉత్సాహంగా గదిలోకొచ్చిన పదహారేళ్ళ అమ్మాయిని ఆశ్చర్యంగా చూసింది భవాని.

'మాలా....అది రజనికదూ. ఎంత పెద్దదయి



డి. సుజాతారాణి


పోయింది! చిన్నప్పుడు బొమ్మలా ఉండేది. యిప్పుడు షో కేస్‌లో బొమ్మ ప్రాణం పోసుకున్నట్లుంది. ఏం రజీ....నేను గుర్తులేనా?' నవ్వుతూ అడిగింది భవాని.

"ఓ....భవాని. తమరు రచయిత్రులయిపోలేదుగదా కొంపదీసి. మరో నిమిషం నిల్చుంటే సర్వాంగ వర్ణన ప్రారంభిస్తారేమోనని భయంగా ఉంది. పెళ్ళి చూపులక్కాని రాలేదు గదా" చిలిపిగా కుర్చీ చేతిమీద కూర్చుంటూ అంది.

"రజని ఎంత మాటకారయిందే మాలా! నువ్వు మాత్రం ఎప్పుడూ ఏదో లోకాల్లో ఉన్నట్లు అలాగే ఉన్నావు. ఒక్క మాటా లేకుండా...." నిష్ఠూరంగా అంది భవాని. కబుర్లు చెప్తూనే రజనితో తనను పోలుస్తున్న భవాని చూపుల్ని భరించలేక కళ్ళు దించుకుంది మాలతి.

"మీరిద్దరూ అక్క చెల్లెళ్ళని పేరేగానీ... ఏ ఒక్క దానిలోనూ యిద్దరికీ పోలికలేదు. రంగు, ఎత్తు, లావు, అందం—ఆఖరికి చదువులో కూడా. ఆ నీలం రంగు రజని వంటికెంత అందంగా ఉందో, నీ వంటికంత అసహ్యంగా ఉంది. యికనుంచయినా లైట్ కలర్స్, శారీస్ కట్టటం మొదలెట్టు" నవ్వుతూ అన్న ఆ మాటల్లోని వ్యంగ్యానికి కలుక్కుమంది మాలతి హృదయం.

"మరి నేవస్తానే. రజనితో మా యింటికో మారు రా. నువ్వు మౌనవ్రతం పట్టినా రజని కబుర్లతో కాలమే తెలీదు. తప్పక వస్తారు కదూ" అని అడుగుతున్న భవాని వేపు చూసి ఉత్సాహంగా



## స్త్రీ నేరస్తులు

స్త్రీలు కూడా
నేరాలు చేస్తారా?

దొంగతనాలూ
హత్యలూ చేస్తారా??

"అవును చేస్తారు!"
అని విన్నప్పుడు మనం ఆశ్చర్యపోతాము

ఒక తల్లి తన పదిహేనేళ్ళ
అబ్బాయిని హత్య చేసింది!!

మరొక ఆమె భర్తనే
హత్య చేసింది!!

ఇంకొక ఆమె తన నలుగురు పిల్లల్నీ
బావిలో పారేసి, చంపేసింది!!

వారు ఏ పరిస్థితులలో అలాంటి ఘోర
నేరాలు చెయ్యవలసివచ్చింది?
ఏమిటి కారణం?

అందుకు వారు అనుభవిస్తున్న శిక్ష ఏమిటి?...

మొదలైన విషయాలు వింటున్నప్పుడు–
ఒళ్ళు జలదరిస్తుంది...

వెల్లూరు జైల్లో అటువంటి శిక్షలు
అనుభవిస్తున్న నేరస్తులు చెప్పిన
విషయాలను

**వచ్చే సంచిక నుంచి**

మీరు

వనిత'లో చదవబోతున్నారు.


తలూపింది రజని; నిశ్శబ్దంగా తలూపింది మాలతి.

*

"పార్వతీ....మీ మాలకేవో సంబంధాలు చూస్తున్నామన్నారు. కుదిరాయా ఒక్కటైనా?" అక్కడే కూర్చునున్న పార్వతిని అడిగింది విద్య.

"అ....ఏం కుదరటంలే. అసలే అనాకారి ముఖం. దానికితోడు స్ఫోటకం కూడా తయారయింది. ఎవరు మాత్రం చేసుకుంటారు? వచ్చిన వారందరూ పెదవి విరుస్తూ పిల్ల నచ్చలేదని రాసే



డి. సుజాతారాణి

విద్యార్థినుల కథా రచనల పోటీలో రెండవ బహుమతి పొందిన 'వాసనలేని పూవు' రచయిత్రి. హైద్రాబాదు వనితా మహా విద్యాలయలో ఈమె ఇంటర్ (తొలి సంవత్సరం) చదువుతున్నది.

స్తున్నారు. వేలకు వేలు కట్నాలు పోయగలిగే తాహతా లేదు! పోనీ చదువులోనైనా పైకొచ్చి ఏ ఉద్యోగమో చేసుకుని తన పొట్ట తాను పోషించుకోగలదంటే 'సెన్స్' దాటలేక మానేసింది. యిక లాభం లేదని షైపులో చేర్చా మీమధ్యనే" చిరాగ్గా అంది పార్వతి.

"అదికాదు ఆంటీ-అక్కను చూడటానికి వచ్చిన వాళ్ళందరూ నల్లగా చింత పండు మొద్దుల్లా ఉన్నారు. పైగా ఎవరూ డిగ్రీహోల్డర్స్ కూడా కాదు. ఆ దేభ్యం మొహాలు నన్నయితే చేసుకుంటార్ట. నేనందుకే స్పష్టంగాచెప్పా. నా చదువు పూర్తికావాలి. అప్పటిదాకా కాచుక్కూచుంటామన్నా ఏడిగ్రీ. అర్హతాలేని మిమ్మల్ని మటుకు చచ్చినా చేసుకోను–అని...." నవ్వుతూ చెప్తున్న రజని మాటలు శూలాల్లా గుచ్చుకుంటున్నాయి–దూరంగా కూర్చున్న మాలతికి. చేతిలో పుస్తకం ఉందేకాని ఆమె మనసెక్కడో ఉంది. ఏ ప్రత్యేకతా అర్హతాలేని తనకు అంతకంటే మంచి సంబంధాలు ఎలా వస్తాయి?—

'యిప్పట్నించే గుదిబండలాగా నీకు పెళ్ళెందుకు? హాయిగా చదువు పూర్తిచేయి. ఆపైన ఏడాక్టరో, కలెక్టరో నీ అందాన్ని చూసి కానీ కట్నం లేకుండా చక్కా పెళ్ళాడేసి పోతాడు....' ఆప్యాయంగా అంటున్న విద్య మాటలకు గర్వంగా సిగ్గుపడింది రజని. మాలతి హృదయంలో నిశ్శబ్దంగా ఎన్ని తుఫానులు రేగుతున్నాయో గమనించగలిగే స్థితిలో లేరెవ్వరూ.

అందంగా, మత్తుగా, ఆకర్షణీయంగా వాసననిచ్చే గులాబి మీదకే ఎగబడతా రందరూ. అవేమీలేని గడ్డి పూవును నిర్లక్ష్యంగా విసిరేస్తారు. గడ్డిపూవు, గులాబి పక్కనుంటే మరింత హేయంగా కన్పించటంలో వింతేముంది? రజని గులాబి, తను....గడ్డి పూవు.

"అదిగాదు విద్యా. నలుగురు పిల్లల తండ్రి, నలభయ్యేళ్ళ వయసు ఉన్న రెండో పెళ్ళాయన్ను ఎలాగో కుదిర్చారు మీ బావగారు. ఆడదిక్కెవరూ లేకపోవడంతో వంటకు, పిల్లల్ని చూడటానికి యిబ్బంది పడ్తున్న అయనకు ఆస్తి పాస్తులేమీ లేకున్నా టీచరుద్యోగముంది. దీని కంత కంటే మంచివాడు దొరక పోయాడుల్లే అనుకుని అవిటి కాలైనా పర్వాలేదనుకున్నాము. తీరాప్రధానం కోసం వస్తుండగా ఆ బస్ యాక్సిడెంట్ అయి, ఆయన కాస్తా 'హరీ' మన్నాడు. యిక దాంతో ఒక్కరు గూడా ముందుకు రావటం లేదనుకో. యిక దీనికి పెళ్ళయ్యే యోగం లేకపోగా కలకాలం మా గుండెలమీద కుంపటిలా తయారయింది. యింత దురదృష్ట జాతకురాలు నా కడుపునెందుకు పుట్టిందోనని....యిది భూమ్మీద పడ్డ క్షణంనించీ ఏడవలేక చస్తున్నా....' ముక్కు చీదుకుంటూ అంటున్న తల్లినోదారుస్తోంది విద్య. మరక్కడ కూర్చోలేక నిశబ్దంగా లేచి పక్క గదిలోకెళ్ళింది మాలతి. కను కొలకుల్లో ముత్యాల్లా నిలచిన కన్నీటిని గోటితో విదిలించుకుంది.

తను అనాకారిగా పుట్టటం తన తప్పా?

అందంగా, తెలివిగా, చలాకీగా ఉండే రజని అంటే–అమ్మకెంత ప్రేమో అందుకు వ్యతిరేకంగా ఉండే తనంటే అంత అసహ్యం. ఎంత తల్లయినా సంఘంలో గౌరవం పెంచే పిల్లల్ని అభిమానించటం సహజమేగా. ఎలాగైనా తన జీవితాన్ని వద్దుకు చేర్చాలని అన్నందుకు నాన్న చేసిన ప్రయత్నాలన్నీ వ్యర్థమవటంతో ఆయనకూ సానుభూతి స్థానంలో ద్వేషం పెరుగుతోంది. తనను మనసారా అభిమానించే స్నేహితులు కూడా లేరు. నిత్యమూ మనోవ్యథతో చెప్పరాని వేదనతో తనే అందరికీ దూరమవుతోందేమో. అదృష్టానికి ప్రతిరూపంలా చెల్లిని సృష్టించిన ఆ దేవుడు నా విషయంలో యింత పక్షపాతం చూపాడెందుకు? ఈ లోకంలో నేను ఒంటరిదాన్ని. 'నన్ను నన్నుగా ప్రేమించి నా కోసం కన్నీరు నింపే' 'నా' అనే వారెవరూ లేరు నాకు....! దిండంతా కన్నీళ్ళతో తడసిపోయింది. నిశ్శబ్దంగా బయటకు రానీయకుండా మూగగా రోదిస్తున్న ఆమెకు హఠాత్తుగా మెరుపులాటి ఆలోచన వచ్చింది. మరుక్షణం కాగితం మీద ఏదోరాసి బాగ్‌లో రెండు చీరెలు పెట్టుకొని ఎవరూ చూడకుండా పెరటి దోవన బయటకు నడిచింది మాలతి.

*

మెళ్ళో పూలమాలలతో....గాగుల్స్ పెట్టుకున్న ఓ అబ్బాయి చేయి పట్టుకు వస్తున్న మాలతిని కళ్ళప్పచెప్పి చూడసాగింది పార్వతి.

'ఆశీర్వదించమ్మా!' నవ్వుతూ నమస్కరించారు.

'నీకు....నిన్ను....యితనెలా....?' ఎత్తుగా ఆరోగ్యంగా ఉన్న అతన్ని అయోమయంగా చూస్తూ తడబడింది పార్వతి.

'యింత అందమైన వాడెలా చేసుకున్నాడనా అమ్మా! తన అందం తనే చూసుకోలేని దురదృష్ట జీవి. అందుకే నా అందంతో పనిలేకుండా నన్ను మనస్ఫూర్తిగా యిష్టపడి చేసుకున్నాడు. చిన్నప్పుడు మన యింటి పక్కనున్న రామ్మూర్తి మాస్టారబ్బాయి – శంకర్' పరిచయం చేస్తూ అతని కూలింగ్స్ తీసేసింది మాలతి.


'శంకర్....పుట్టు గ్రుడ్డికదూ....' అందోళనగా అడిగింది తల్లి.

'అవునమ్మా....ఈ లోకంలో అందరూ.... స్నేహితులు, బంధువులు, ఆఖరికి కన్న తల్లిదండ్రులు కూడా నా శారీరకమైన అందానికే ప్రాధాన్యత యిచ్చారుకానీ, నాకూ మనసుంటుందనీ.... ఆశలు, కోరికలు ఉంటాయని, ఒక్కరంటే ఒకరైనా ఆలోచించారుకాదు. శంకర్‌కు కావల్సింది అందం కాదు. ప్రేమానురాగాలతో తన భారాన్ని స్వీకరించి తనను నడిపించి కళ్ళులేని లోటు తీర్చగలిగే ఓ తోడు. నాక్కావల్సింది-నామనసును మాత్రమే చూడగలిగి, నన్ను నన్నుగా ప్రేమిస్తూ నా కోసమే జీవించే భర్త. మీ అనుమతి లేకుండా ధైర్యం చేసినందుకు క్షమించమ్మా!' కళ్ళనీళ్ళతో అర్థించింది మాలతి.

'ఎంతపని చేశావు మాలతీ! రేపు నీకూ గుడ్డి పిల్లలే పుడితే వారి భవిష్యత్తేమవుతుందో ఆలోచించావా?' పార్వతిలో ఎక్కడో దాగిఉన్న మాతృ హృదయం తల్లడిల్లింది.

మాలతి నవ్వింది.

'శంకర్ గుడ్డితనమే కాకుండా నా రూపం కూడా వస్తే మరెంత చిత్రహింస అనుభవించాల్సి వస్తుందో ఆలోచించావా అమ్మా! కళ్ళులేకుండా ఆయన పడినబాధా, కురూపిగా నేననుభవించిన మనోవ్యధా ఏనాటికీ మర్చిపోలేము. అందుకే, ఆ అవకాశం రానీయమమ్మా. తిండికి, ప్రేమకు, అనురాగానికి అలమటించిపోయే ఓ పేదపిల్లను పెంచుకోవాలని ముందుగానే నిశ్చయించుకున్నాము' దృఢంగా చెప్తున్న మాలతి ఎంతో ఎదిగిపోయినట్లు అన్పించి ఆశ్చర్యంతో అలాగే చూస్తూండిపోయింది పార్వతి! □



## పుస్తకాలు

### భ్రమర

[రెండు నవలికలు]

**[రచన: షీలా శివరామ్; ప్రచురణ: నవోదయా పబ్లిషర్స్, విజయవాడ-2; ⅛ క్రౌన్ సైజులో 160 పేజీలు; వెల: 5-50.]**

ఈ సంపుటంలో భ్రమర, నిరీక్షణ అని, రెండు నవలికలున్నాయి. 'భ్రమర'లో విశాలాక్షి పెంపుడు కొడుకు రాజు, తన స్నేహితుడు విజయ్ కోసం వచ్చి అక్కడ భ్రమరను చూసి నిందించటంతో కథ మొదలై గతంలోకి వెళ్తుంది.

రాజయ్య తాత పోవటంతో ఒంటరిదైన భ్రమర రాణీ అమ్మగారింట్లో పనికి కుదురుతుంది. పాఠకుల ఊహ దెబ్బతినకుండా రాణీగారి కూతురు విశాలాక్షే భ్రమర కన్నతల్లని తెలుస్తుంది. తన కోసం తల్లి జీవితం సుడిగుండంలో ఇరుక్కోవటం సహించలేని భ్రమర ఇల్లు వదిలి తండ్రిని వెదుక్కుంటూ వెళ్ళి ఆయన అండలో నిశ్చింతగా, తోబుట్టువుల అభిమానంతో ఆనందంగా వుంటుంది. చివర్లో భ్రమర దగ్గరకు ట్యూషన్ కొచ్చే సురేష్ అన్నయ్య విజయ్, భ్రమరను ప్రేమించి పెళ్ళిచేసుకొని న్యూయార్క్ తీసుకెళ్ళిపోతాడు.

కథని కావాలని పెంచినట్లుగా అనిపించినా రచయిత్రి మలిచిన మలుపులు అందంగా వున్నాయి. భ్రమరను పనిమనిషిగా చూడలేక, కాదని చెప్పలేక, కన్న కూతురని చెప్పుకోలేక కుమిలిపోయిన తల్లిగా విశాలాక్షి పాత్రను అతి సహజంగా చిత్రించారు రచయిత్రి.

'నిరీక్షణ' పేరులోనే అందాన్ని, విషాదాన్ని దాచుకున్న ఈ ప్రేమకథ కొన్ని దశాబ్దాల తర్వాత కూడా కొత్తదిగానే అనిపించి, పాఠకుల చేత కన్నీరు కార్పిస్తుంది.

అమర్, నూర్జహాన్ కాలేజీలో స్నేహితులు. వారి మతాంతర వివాహానికి పెద్దలెవరూ అంగీకరించరు. ఆప్తుల్ని అయినవాళ్ళందర్నీ శాశ్వతంగా విడిచి, పాట్నాలో సోషల్ వర్కర్‌గా పనిచేస్తున్న అమర్ అన్నయ్య దగ్గరకు, తమ భావి జీవితం గురించి కలలుకంటూ పయనమవుతారు. ఆ రైలు ప్రయాణంలో జరిగిన హఠాత్సంఘటన వాళ్ళిద్దర్నీ వేరుచేస్తుంది.

పద్దెనిమిది సంవత్సరాలుగా ఆ పాట్నా రైల్వే స్టేషనులోనే, ఆగిన ప్రతి రైలునూ పరికిస్తూ, అమర్‌కోసం నిరీక్షిస్తూ, ఆఖరిరోజు వరకూ అతన్నే ధ్యానిస్తూ కళ్ళు మూస్తుంది నూర్. ఆ పద్దెనిమిది సంవత్సరాలనుంచీ నూర్జహాన్‌ను ఆరాధిస్తూ, ఆమెని కనిపెట్టుకొని వుంటాడు రతన్‌సింగ్.

ఈ విషాద ప్రేమగాథను అతి నేర్పుగా, పాఠకుల మనసులకు హత్తుకొనేలా రచించారు రచయిత్రి. కథ చదివిన అనుభూతి కొన్ని రోజుల దాకా పాఠకులపై పని చేస్తూనే వుంటుంది!